క్లుప్తంగా

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

రెబ్బెన: మండల కేంద్రంలోని రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో గురువారం ఉదయం 9 గంటలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జాకీర్ ఉస్మాని ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సీనియర్ లీగల్ జడ్జి లీగల్ సర్వీస్ కార్యదర్శి కే.యువరాజు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు న్యాయచట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ బాలుర కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చుతున్నారు. శబ్దోకి బగియా అనే అంశంపై జాతీయ స్థాయిలో హిందీ కవిత్వ గీతా ప్రకాశ్ ఆధ్వర్యంలో పుస్తకాన్ని ప్రచురిస్తున్నారు. ఇందులో 216 మంది కవులు కవిత్వాలు రాయగా.. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల విద్యార్థులు ముగ్గురికి కవిత్వం రాసేందుకు చోటు దక్కింది. ఈసందర్భంగా బుధవారం ప్రిన్సిపాల్ విఠల్, లెక్చరర్లు నాగోరావులు ఆ విద్యార్థులను అభినందించారు. అమన్ అనే విద్యార్థి బాల్యం గురించి, సూర్యవంశీ అనే విద్యార్థి దేశభక్తి గురించి, సందేశ్ అనే విద్యార్థి ప్రేరణ, ఆత్మవిశ్వాసం కవిత్వాలు రాశారు.

గుంజాలలో వైద్య శిబిరం

తాంసి: భీంపూర్ మండలంలోని గుంజాల గ్రామంలో బుధవారం భీంపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. భీంపూర్ వైద్యాధికారి నిఖిల్‌రాజ్ వైద్య సిబ్బందితో కలిసి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. దగ్గు, జ్వరంతో పాటు ఇతర సీజనల్ వ్యాధులతో బాధపడుతునన వారిని గుర్తించి మందులు పంపిణీ చేశారు. మొత్తం 46 మందికి వైద్య పరీక్షలతో పాటు రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, హెల్త్ అసిస్టెంట్ విష్ణు, ఏఎన్ఎం లచ్చుబాయి, ఆశ కార్యకర్తలు సంతోషిని, మీరా, కమల పాల్గొన్నారు.

వివాహానికి పుస్తెమెట్టెలు అందజేత

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన ఎంబడి సునీత వివాహానికి లక్సెట్టిపేట శివసాయిగణేష్ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం పుస్తెమెట్టెలు అందజేశారు. సునీతది నిరుపేద కుటుంబం కావడంతో పాటు, తండ్రి చనిపోయాడు. దీంతో ఆమె వివాహానికి వీటిని అందించినట్లు సేవాసమితి అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామమూర్తి తెలిపారు. సమితీ సభ్యులు ప్రసన్న, సుమతమ్మ, ప్రభాకర్, ప్రసాద్ ,విజయలక్ష్మి, ధనలక్ష్మి, శ్రీనివాస్, లావణ్య, వైష్ణవి, లక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

దండేపల్లి: ఎస్సీ రిజర్వేషన్‌కు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 11న హైదరాబాద్‌లో మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం మహాసభ పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి తగరపు సత్యం, నాయకులు మాదిగ శ్రీనివాస్, నరేష్, వినయ్, సతీష్, గణేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకా కేంద్రాల పరిశీలన

మంచిర్యాలటౌన్: పట్టణంలోని రాజీవ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న టీకా కేంద్రాలను బుధవారం మంచిర్యాల డివిజన్ ఆరోగ్య అధికారులు సందర్శించి పరిశీలించారు. సీహెచ్‌వో రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ అకోశ్‌రోడ్డు, ఇక్బాల్ అహ్మద్‌నగర్, రాజీవ్‌నగర్‌లోని టీకా కేంద్రాల్లో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఐస్‌ప్యాక్ కండీషనింగ్, వీవీఎం, ఎక్స్‌పైరీ తేదీ, ఓపెన్ వాయిల్ పాలసీ, టీకా అనంతరం అనర్థాల నివారణ కిట్, హబ్ కట్టర్ ప్రాముఖ్యతను వివరించారు. అన్ని రకాల టీకాలను నిర్ణీత సమయానుసారం పిల్లలకు ఇప్పించి, వివిధ రకాల వ్యాధుల నుంచి పిల్లలను కాపాడాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన భవిష్యత్ సమాజ నిర్మాణం కోసం పిల్లలకు వ్యాధినిరోధక టీకాలను ఇప్పించాలని, టీకాలను ఇచ్చిన వెంటనే యూవిన్ యాప్‌లో పొందు పరచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద, ఏఎన్ఎంలు విజయ, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సుజాత పాల్గొన్నారు.

బీసీ జాగృతి పట్టణ యువజన సంఘం అధ్యక్షుడి ఎన్నిక

పాతమంచిర్యాల: తెలంగాణ బీసీ జాగృతి యువజన సంఘం పట్టణ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పుట్ట కళ్యాణ్‌ను నియమిస్తున్నట్లు తెలంగాణ జాగృతి పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. నియామక పత్రాన్ని తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్ అందించారు. బీసీ జాగృతి సంస్థాగత నిర్వహణలో పాలుపంచుకుని బీసీల సమస్యల పరిష్కరించడానికి కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్టాల మల్లేష్, ఉపాధ్యక్షుడు హిమ్మత్ సింగ్, హమాలీసంఘం అధ్యక్షులు లక్ష్మణ్, శేర్ల కనకరాజు పాల్గొన్నారు.

పూత, కాతలే కీలకం..!

- పూత, పిందె దశకు చేరిన కంది పంట
- వాతావరణ మార్పులతో తెగుళ్ల బెడద
- అప్రమత్తంగా ఉంటేనే అధిక దిగుబడి


రెబ్బెనలో పత్తిలో అంతరపంటగా సాగు చేసిన కంది పంట

రెబ్బెన: పప్పు దినుసుల సాగులో ముఖ్యమైన పంట కంది. వానాకాలం సీజన్‌లో సాగు చేసిన కంది పంటలు ప్రస్తుతం పూత, పిందె దశలో ఉండగా ఈ సమయంలో పంటలకు చీడపీడలు, తెగుళ్ల ప్రభావం అధికంగా ఉంటుంది. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి సాధ్యమవుతుంది. రైతులు అప్రమత్తంగా ఉండి సకాలంలో తెగుళ్లు, పురుగును నివారించినప్పుడే దిగుబడి పెరిగి రైతుకు లాభం చేకూరుతుంది. ఐదు నెలల కంది పంట కాలంలో ఈనెల రోజులు ఎంతో కీలకమని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పూత, పిందెల దశలో పురుగు ఉధృతి, తెగుళ్ల బెడద అధికంగా ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

1400 ఎకరాల్లో కంది సాగు

మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు వానాకాలం సీజన్ కింద 1400 ఎకరాల్లో కంది సాగు చేపట్టారు. అయితే అధిక శాతం రైతులు పత్తిలో అంతర పంటగా కందిని సాగు చేస్తున్నారు. జైలైలో ప్రారంభమైన కంది పంటలు ప్రస్తుతం పూత, పిందె దశకు చేరుకున్నాయి. మరో రెండు నెలల్లో పంట చేతికి అందుతుంది. అయితే ఈనెల రోజులు కంది పంటకు ఎంతో కీలకమని, వాతావరణంలో చోటు చేసుకునే మార్పులతో పూత, పిందె దశలో కంది పంటలు పురుగు, తెగుళ్ల బారిన పడే అవకాశం అధికంగా ఉంటుందంటున్నారు. సకాలంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే పంటలో ఆశించిన దిగుబడి సాధ్యమవుతుంది. మండలంలో నేల స్వభావాన్ని బట్టి కంది దిగుబడి సగటున ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు ఉండగా, అంతర పంటలో ఎకరానికి సుమారు 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కంది పంటకు ఈ సంవత్సరం క్వింటాల్‌కు రూ. 7200 మద్దతు ధర కల్పిస్తుండగా, ప్రస్తుతం ప్రైవేట్‌లో క్వింటాల్‌కు రూ. 8 వేల నుంచి రూ. 9వేల వరకు చెల్లిస్తున్నారు.

మబ్బులతో తీవ్ర ముప్పు

వాతావరణంలో ఏర్పడే మార్పులు కంది పంట దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. అధికంగా కురిసే మంచుతో పాటు ఆకాశంలో ఏర్పడే మబ్బులు కంది పంటను తీవ్రంగా నష్టపరుస్తుంటాయి. మబ్బుల కారణంగా కందిలో పూతలు రాలిపోవటంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపే లద్దె పురుగు పంటలను ఆశించి తీవ్రంగా నష్టపరుస్తుంది. ఆకులపై రంధ్రాలు చేయటంతో పాటు పిందె, కాయలను తొలిచివేస్తాయి. ఇక మంచు అధికంగా కురిస్తే ఇసుక నేలల్లో సాగు చేసే పంటల్లో ఫుజేరియం ఎండు తెగులు ఆశించి చెట్టు పూర్తిగా ఎండిపోతుంది.

నివారణ చర్యలు ఇలా..

- కంది పంటలను ఆశించే తెగుళ్లు, పురుగులను నివారించేందుకు వ్యవసాయశాఖ అధికారులు పలు రకాల సూచనలు చేస్తున్నారు. పూత, పిందె దశలో ఆశించే లద్దె పురుగును నివారించేందుకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములను 200 లీటర్లలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. లేదా క్లోరాన్‌ట్రానిప్రోల్ 60 మిల్లీలీటర్ల ద్రావణాన్ని ఎకరానికి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి అధికంగా ఉంటే వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- మబ్బుల కారణంగా పంటల్లో పూత రాలుతుంటే బోరాన్ 250 గ్రాములు లేదా నాఫ్తలేన్ ఎసెటిక్ యాసిడ్ 40 మిల్లీలీటర్ల ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ఫుజేరియం ఎండు తెగులు ఆశిస్తే చెట్టును వేర్లతో సహా పీకి పంటకు దూరంగా పడేయాలి. దాంతో మరో చెట్టుకు ఈ తెగులు ఆశించే అవకాశం ఉండదు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఈ నెల రోజులు కంది పంటలకు ఎంతో కీలకం. ఈ సమయంలోనే వాతావరణంలో ఏర్పడే మార్పులు కంది పంటలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. మబ్బుల కారణంగా పూతలు రాలిపోవటం, పురుగు ఆశించటం జరుగుతుంది. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి పూతను కాపాడుకోవటంతో పాటు పురుగును నివారించుకోవాలి. లేకుంటే పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది.

– మంజుల, మండల వ్యవసాయాధికారి

పీఎస్‌లలో సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో మహేందర్

కెరమెరి: మండలంలోని 29 పోలింగ్ బూత్ కేంద్రాల్లో ఈ నెల 28 లోపు విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, ఫర్నిచర్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో మహేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, ఈజీఎస్ టీఏ, ఎఫ్ఏలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికీ కొన్ని పీఎస్‌లల్లో సౌకర్యాలు లేవన్నారు. గ్రామ పంచాయతీల్లో నర్సరీ పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. బ్యాగ్ ఫిల్లింగ్, మట్టి సేకరణ జరగాలని ఆదేశించారు. ప్రతి నెల మొదటి వారంలో పని చేసిన కూలీల పే ఆర్డర్ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని పేర్కొన్నారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య ఉన్నారు.

బెండార గ్రామంలో డ్రైడే


డ్రైడే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: మండలంలోని బెండార గ్రామంలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, చిన్న పిల్లలకు అందుతున్న సేవలు, టీకాల ఆవశ్యకత, పౌష్టికాహారం వంటి అంశాలపై పర్యవేక్షించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డ్రైడేలో భాగంగా నిల్వ నీరు ఉండే ప్రాంతాల్లో, మురికి కాలువల్లో యాంటీ లార్వా మందులు వేశారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, హెల్త్ అసిస్టెంట్ కృపావాణి, భగవాన్‌దాస్, ఎమ్ఎల్‌హెచ్‌పీ మమత, బ్రీడింగ్ చెక్కర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లతో తిప్పలు


గుంతలమయంగా కౌటాల -తుమ్మిడిహెట్టి రోడ్డు


అధ్వానంగా మొగడ్‌దగడ్- తాటినగర్ రోడ్డు

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- వాహనదారులు, ప్రజలకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

కౌటాల: మండల కేంద్రం నుంచి మొగడ్‌దగడ్, తాటిపల్లి, బాలేపల్లి, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి గ్రామ పంచాయతీలతో పాటు పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన తారురోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో బస్సులు, ఆటోల ద్వారా ప్రయాణించే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొగడ్‌దగడ్ –తాటినగర్ తారు రోడ్డుపై కూడా భారీ గుంతలు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం..

మండల కేంద్రం నుంచి తుమ్మిడిహెట్టి వెళ్లే రోడ్డుపై అడుగడుగున గుంతలు ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కౌటాల నుంచి మొగడ్‌దగడ్, బాలేపల్లి గ్రామాల సమీపంలోని రోడ్డుపై అధికంగా గుంతలు పడి పూర్తిగా చెడిపోయింది. అత్యవసర సమయాల్లో గ్రామాలకు అంబులెన్సులు వెళ్లడానికి చాలా కష్టాలు ఎదురవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి మొగడ్‌దగడ్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టు వద్ద రోడ్డుపై గుంత ఏర్పడింది. కల్వర్టు సైతం కోతకు గురైంది. దీంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది.

అధికారుల నిర్లక్ష్యం..

ప్రతిరోజు వందల వాహనాలు వెళ్లే రహదారి గుంతలమయంగా మారి ఏళ్లు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రం నుంచి తుమ్మిడిహెట్టి, ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన తారురోడ్డుకు మరమ్మతులు చేయాలని, కోతకు గురైన కల్వర్టు నిర్మించాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి

మండల కేంద్రం నుంచి మొగడ్‌దగడ్, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డుపై అడుగడుగున గుంతలు పడ్డాయి. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. కల్వర్టు కోతకు గురవడంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు పట్టించుకోవాలి.

– సంజీవ్, గుండాయిపేట

‘తెలంగాణ తల్లిని అవమానించారు’


విగ్రహం ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వాంకిడి: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన కేసీఆర్ సభ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవ ప్రతీక తెలంగాణ తల్లి విగ్రహాన్ని తెర చాటున బంధించి అవమానించారని కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ యూత్ నాయకుడు జాడె ప్రవీణ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రధాన కూడలి సమీపంలో గల తెలంగాణ తల్లి విగ్రహం ముందు బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఓ భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం కనపడకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఏంటని మండిపడ్డారు.

కొనసాగుతున్న ‘ఉపాధి’ పనులు


కెలిబిలో పనులు చేస్తున్న కూలీలు

కెరమెరి: మండలంలోని 31 గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ పథకంలో పనులు కొనసాగుతున్నాయి. బుధవారం పరధోళి, అంతాపూర్, ముకదంగూడ గ్రామపంచాయతీలలో రోడ్డుకిరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు తొలగించారు. సుర్దాపూర్, సాంగ్వి గ్రామ పంచాయతీల్లో గుట్ట కింద భాగంలో నీటి నిల్వ కోసం సీసీటీ పనులు చేపట్టారు. మరికొన్ని పంచాయతీల్లో నర్సరీ పనులు కొనసాగుతున్నాయి.

సెల్‌ఫోన్ అందజేత

బోథ్: మండల కేంద్రానికి చెందిన కుమార్ తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. కాగా సొనాలకు చెందిన శుద్దోధన్, శ్రీధర్‌లు బోథ్ నుంచి సొనాలకు వెళ్తుండగా బోథ్‌ను ఆనుకుని ఉన్న వంతెనపై వారికి సెల్‌ఫోన్ దొరికింది. ఫోన్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించేందుకు వెళ్తుండగా.. కుమార్ తన ఫోన్ కోసం వెతుకుతున్నట్లు గమనించి, ఆయనకు ఫోన్ అప్పగించారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో బుధవారం జైనథ్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సీసీఐ పత్తి కొనుగోళ్లను మార్కెట్ కమిటీ కార్యదర్శి కాంబ్లే మధుకర్ ప్రారంభించారు. క్వింటాలుకు మద్దతు ధర రూ.7,020 నిర్ణయించి, కొనుగోళ్లు చేపట్టారు. కార్యక్రమంలో సీసీఐ సీపీవో హితేష్, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

కాగజ్‌నగర్‌రూరల్: ఆర్థిక సాంకేతిక, అక్షరాస్యతపై బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పొదుపు వివరాలు, బ్యాంకు పథకాలపై వివరించారు. సామాజిక భద్రత పథకాలు, సురక్షబీమా యోజన, జీవనజ్యోతి బీమాయోజన, అటల్ పెన్షన్ యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్ మోసాలపై జాగ్రత్త వహించాలని పాటల రూపంలో అవగాహన కల్పించారు. బ్యాంకు మేనేజర్ సాయిచరణ్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ జగదీశ్, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, కళాజాత బృందం, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీం విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న కుమురం భీం విగ్రహం ఏర్పాటుకు ఆదివాసీలు సహకరించాలని ఆదివాసీ పెద్దలు కోట్నాక్ భారిక్‌రావ్, హేరేకుమ్ర జంగు పటేళ్లు కోరారు. బుధవారం గిన్నేర రాయిసెంటర్ పరిధిలోని గ్రామాల్లో చందా వసూలు చేశారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడినా.. కుమురం భీం విగ్రహం ఏర్పాటు పనులు పూర్తి దశకు చేరుకున్నాయన్నారు. త్వరలో విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీలు తుమ్రం మారుతి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. పట్టణంలోని గాంధీ పార్కులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ కోఆర్డినేటర్ యశోద మాట్లాడుతూ.. మహిళలు ఇబ్బందులకు గురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, సుకన్య సమృద్ధి యోజన, మహిళ సాధికారత, లింగ ఆవశ్యకత, లింగసమానత్వం, అక్షరాస్యత, లింగ నిర్ధారణ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో వనజ, సూపర్‌వైజర్ గౌరి, కోటేశ్వర, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

‘గిరి’ గ్రామాల్లో గుస్సాడీల కోలాహలం


సాకడ(ఏ)లో దండారీ ఆడుతున్న ఆదివాసీలు


నృత్యం చేస్తున్న గుస్సాడీలు


వాయిద్యాలు వాయిస్తున్న కళాకారులు

- ఆకట్టుకుంటున్న దండారీ నృత్యాలు
- పల్లెల్లో పండుగ వాతావరణం

కెరమెరి: కాళ్లకు గజ్జెలు కట్టుకొని, అడుగులో అడుగు వేస్తూ గుస్సాడీలు చేస్తున్న నృత్యాలు కనువిందు చేస్తున్నాయి. రెండు రోజుల క్రితం నియోజకవర్గంలోని కెరమెరి, సిర్పూర్(యూ), జైనూర్, లింగాపూర్ మండలాల్లోని వివిధ గూడేల్లో ప్రారంభమైన సంబరాలు దీపావళి వరకు కొనసాగనున్నాయి. దీంతో ఆదివాసీ గ్రామాల్లో పండుగ వాతావరణం చోటుచేసుకుంది. డప్పుచప్పుళ్లతో పల్లెలు మారుమోగుతున్నాయి.

గుస్సాడీ దీక్షలు..

ఏత్మాసార్ దేవునికి మొక్కుకొని ఆదివాసీలు దీక్ష స్వీకరిస్తారు. దీక్షలో భాగంగా నెమలి పింఛాలతో తయారు చేసిన టోపీని తలపై పెట్టుకుని శరీరానికి బూడిద, ఆముదం నూనె పూసుకుంటారు. భుజానికి తోలును తగిలించుకుంటారు. దీక్షా కాలంలో కుర్చీ, మంచాలపై కూర్చోకూడదు. గుస్సాడీలు దీక్ష కాలంలో ఆరుబయటే నిద్రిస్తారు. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి దండారీలు వెళ్లినప్పుడు అక్కడి వారు ఆతిథ్యం ఇవ్వడం ఆనవాయితీ. వెళ్లిన చోట దండారీ ఆడతారు. వినోద భరితమైన, సమాజానికి ఉపయోగపడే నాటికలు ప్రదర్శిస్తారు. వీరి ప్రత్యేక వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంటుంది.

గూడేల్లో సంబరాలు..

నియోజకవర్గంలోని సుమారు 200 గూడేల్లో బుధవారం గుస్సాడీ సంబరాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని చౌపన్‌గూడ, సుర్దాపూర్, ఝురి, మోడి, హట్టి, చిన్నసాకడ, పెద్దసాకడ, సాకడ(ఏ) గ్రామాల్లో గుస్సాడీ కోలాహలం కొనసాగింది. ఒక గ్రామానికి మరో గ్రామ దండారీ ఆతిథ్యమిచ్చారు. హట్టిలో అత్యంత వైభవంగా ఉత్సవం నిర్వహించారు. గుస్సాడీ, నృత్యాలు చేసే పోరీలకు సంప్రదాయబద్ధంగా కాళ్లు కడిగి స్వాగతం పలికారు. పెద్దలు ఆత్రం దుర్గు, ఆత్రం సుంగు, జంగు, మకేశ్, జగన్నాథ్, లింబారావు, దుందేరావు, పరుశురాం, గోవింద్‌రావు, సాక్రుబాయి ఉన్నారు.

తపాలా సేవలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

జైనూర్: తపాలశాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సేవలు అందించనున్నట్లు సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుజిత్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తపాల సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తపాల శాఖలో సేవింగ్ ఖాతాతో పాటు ఖాతాలకు సంబంధించిన ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయా జీవితబీమా, రైతుబంధు, రైతుబీమా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాల డబ్బులు తపాల సేవింగ్ ఖాతాల ద్వారా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అశోక్, సిబ్బంది రమేశ్, డోంగ్రే సంతోష్, గజానంద్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.